క్లుప్తంగా

చట్టం ముందు అందరు సమానులే

తహసీల్దార్ షాకీర్ పాషా



కర్లపాలెం: చట్టం ముందు అందరూ సమానులే అని కర్లపాలెం తహసీల్దార్ షాకీర్ పాషా చెప్పారు. సోమవారం కర్లపాలెం పంచాయతీ పరిధిలోని లంక కాలువ కట్ట ఎస్టీ కాలనీ వాసులకు పౌర హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. మీ కాలనీ వాసులను ఎవరైనా కులం పేరుతో దూషించినా, అంటరాని వారిగా ప్రవర్తించినా వెంటనే అధికారులకు తెలియజేయాలని, అధికారులు మీకు అండగా ఉంటారని తహసీల్దార్ చెప్పారు. అందరూ ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన పెంచుకుని అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. పిల్లలను శ్రద్ధగా చదివించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి మాధవ్, వీఆర్వో సాంబయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకట సుబ్బమ్మ కుటుంబ సభ్యులకు పరామర్శ



నగరం: మండలంలోని పెదపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.మోహన రావును, కుటుంబ సభ్యులను సోమవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ పరామర్శించారు. ఇటీవల మోహనరావు తల్లి వెంకట సుబ్బమ్మ మృతి చెందడంతో ఆమె పెదకర్మ పెదపల్లి గ్రామంలో నిర్వహించారు. వెంకట సుబ్బమ్మ చిత్రపటానికి డాక్టర్ గణేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఇంకోల్లు రామకృష్ణ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.కోటేశ్వరరావు, రైతు, యువజన, మైనార్టీ విభాగం నియోజకవర్గ అధ్యక్షులు కె.శ్రీను, డి.కొండరెడ్డి, ఖాదర్‌వలి, నాయకులు కరీముల్లా, వెంకటేశ్వరావు, సుభాని, షాబుద్దీన్ పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు ప్రారంభం

రేపల్లె: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో ఈ నెల 29 నుంచి నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీ రవిచంద్రకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో అకౌంట్స్, అసిస్టెంట్ కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వబడునన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు భారత ప్రభుత్వ సంస్థ, జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఎన్‌ఎస్‌డీసీ), రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్‌ఎస్‌డీసీ) వారిచే సర్టిఫికెట్ జారీ చేయబడునన్నారు. మూడు నెలల శిక్షణ అనంతరం అర్హతను బట్టి అభ్యర్థులకు వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించబడునన్నారు. ఇంటర్, డిగ్రీ చదివి, 18 నుంచి 35 సంవత్సరాలు కలిగిన స్త్రీ, పురుషులు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు స్కిల్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేటర్ సీహెచ్ రవికుమార్‌ను గానీ, 9032384374 నంబరును గానీ సంప్రదించాలని సూచించారు.

గుండె జబ్బులపై అప్రమత్తంగా ఉండండి

తెనాలిఅర్బన్: గుండె జబ్బులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని నందులపేట అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక పేర్కొన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాది సెప్టెంబర్ 29న వరల్డ్ హార్ట్ డేను నిర్వహిస్తారని తెలిపారు. క్యాన్సర్ కన్నా ఎక్కువ మరణాలు గుండె జబ్బుల వలన జరుగుతున్నాయన్నారు. ప్రజల్లో అవగాహన లేకపోవడం వలన ఎక్కువ మంది దీని బారినా పడి మరణిస్తున్నట్లు చెప్పారు. పొగ తాగడం మానేసి, కొలస్ట్రాల్ పెరగకుండా చూసుకోవాలన్నారు. రక్తపోటును అదుపులో ఉంచుకుంటూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు.

తాగు నీరు అందించరూ..!

- శిథిలావస్థలో మండూరు తాగు నీటి ట్యాంక్
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- నిధులు కేటాయించి వాటర్ ట్యాంక్ నిర్మించాలని కోరుతున్న ప్రజలు

చుండూరు(వేమూరు): తాగు నీటి ట్యాంక్ శిథిలావస్థకు చేరుకొని కొన్ని సంవత్సరాలు అయినా ఇంతవరకు అధికారులు వాటర్ ట్యాంక్ గురించి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుండూరు మండలంలోని మండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాగు నీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. దీంతో గ్రామంలోని ప్రజలు తాగు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటర్ ట్యాంక్ పని చేయకపోవడంతో గ్రామంలోని ప్రజలు వారి దాహార్తి తీర్చుకోవడం కోసం ఊరి బయట ఉన్న పంపుల వద్దకు వెళ్లి తాగు నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు వాపోతున్నారు. వేసవి కాలంలో మండూరు ప్రజలు తాగు నీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. గత వేసవి కాలంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేయాలని అధికారులను కూడా నిలదీయడం జరిగిందని గ్రామస్తులు అంటున్నారు.



శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంక్

అయినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- అంతేకాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వాటర్ ట్యాంక్ వైపుకు వెళితే పెచ్చులు ఊడి పడి ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం వాటర్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు కేటాయించి తాగు నీటి సమస్య పరిష్కారం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.
- ఇదిలా ఉండగా గ్రామానికి చెందిన ఎంపీటీసీ రెడ్డి సూర్యప్రభ మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో పలుమార్లు వాటర్ ట్యాంక్ గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం గమనార్హం. అధికారులు వాటర్ ట్యాంక్ నిర్మాణం గురించి ఎలాంటి సమాధానం చెప్పాలేదని ఆమె వాపోతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



మండూరు గ్రామంలోని వాటర్ ట్యాంక్ గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఈ నెల 21వ తేదీన నిర్వహించిన చుండూరు మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలోనూ వాటర్ ట్యాంక్ గురించి అధికారులు దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.


– రెడ్డి సూర్యప్రభ, ఎంపీటీసీ మండూరు

ప్రతి కార్యకర్తకు డిజిటల్ బుక్ తోడ్పడుతుంది

అమర్తలూరు(వేమూరు): కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగం ముసుగులో అనుసరిస్తున్న విధానాలను ఎదుర్కొనేందుకు జగనన్న డిజిటల్ బుక్‌ను ప్రారంభించడం జరిగిందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు హేమచందు శ్రీనివాస రావు తెలిపారు. అమర్తలూరు మండల కేంద్రంలో సోమవారం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంపై పెడుతున్న అక్రమ కేసులను ఎదుర్కొనేందుకు.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు భరోసా కల్పించేందుకు జగనన్న డిజిటల్ బుక్ తీసుకొని రావడం జరిగిందన్నారు. ప్రతి కార్యకర్తకు డిజిటల్ బుక్ ఎంతో తోడ్పడుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో షేక్ ఇమామ్ హుస్సేన్, పోతర్లంక సురేష్ కుమార్, కొండముది గోమంత్, కుమార్ స్వామి, కట్టుపల్లి రాంబాబు, చిలుమూరు దేవపాలన, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్

చుండూరు(వేమూరు): కూటమి ప్రభుత్వం వలన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను న్యాయపరంగా ఎదుర్కొనడానికి డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించడం జరిగిందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అనపురెడ్డి రఘ రామిరెడ్డి తెలిపారు. చుండూరు మండలంలోని అంబేడ్కర్ నగరంలో సోమవారం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్యాయానికి గురవుతున్న కార్యకర్తల కోసం డిజిటల్ బుక్‌ను ప్రారంభించారన్నారు. అదే విధంగా నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు ఆదేశాల మేరకు డిజిటల్ బుక్ క్యూర్ కోడ్‌ని ఆవిష్కరించడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి గాదె శివరామకృష్ణారెడ్డి, అంగిరేకుల నాగేశ్వరరావు, ఉయ్యూరు రవిశంకర్ రెడ్డి, జాలాది రమేష్, జాలాది సురేష్, జాలాది లోకేష్, జాలాది అనీష్, జాలాది రాజశేఖర్, జ్యోతుల వీరాస్వామి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన పార్టీ మండల అధ్యక్షుడు హేమచందు



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన పార్టీ మండల అధ్యక్షుడు అనపురెడ్డి

స్త్రీల ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యం

కర్లపాలెం: స్త్రీలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని తద్వారా సమాజాభివృద్ధి జరుగుతుందని ఆయుర్వేద వైద్యులు పి.సిద్ధార్థ, యునానీ వైద్యులు రోషన్ ఆరా తెలిపారు. సోమవారం మండల పరిధిలోని పేరలి, దుండివారిపాలెం పంచాయతీ పరిధిలోని శ్రీరామ్‌నగర్ గ్రామాలలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో పేరలిలో 50 మందికి, శ్రీరామ్‌నగర్‌లో 30 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయుర్వేదం, యునానీ వైద్యులు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం వలన అంటువ్యాధులు రావని తెలిపారు. స్త్రీలకు వచ్చే ఆరోగ్య సమస్యలకు సకాలంలో వైద్యం చేయించుకోవాలని సూచించారు. సాధారణ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులకు కూడా ఆయుర్వేద మందులు చక్కగా పనిచేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది డి.ప్రభావతి, ప్రియాంక, షైనీ, మేఘన, రమేష్, చింతాయపాలెం సొసైటీ అధ్యక్షుడు మద్దిబోయిన బుల్లియ్య తదితరులు ఉన్నారు.



శ్రీరామ్‌నగర్‌లో వైద్య సేవలందిస్తున్న డాక్టర్‌లు సిద్ధార్థ, రోషన్ ఆరా

సస్య రక్షణతో అధిక దిగుబడులు

మండల వ్యవసాయ అధికారి విజయరాజు



నిజాంపట్నం: సస్య రక్షణ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి విజయరాజు చెప్పారు. మండలంలోని కూచినపూడి, గరువుపాలెం గ్రామ వ్యవసాయ సహాయ కేంద్రాలలో నానో యూరియా పిచికారీపై సోమవారం నిర్వహించిన క్షేత్ర ప్రదర్శనలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. సాధారణ యూరియా 45 కిలోలు 500 మి.లీ. నానో యూరియాకు సమానమన్నారు. 25 రోజులు, 60 రోజుల దశలో పిచికారీ చేస్తే ఆకుల ద్వారా వెంటనే మొక్కకు అందుతుందన్నారు. భూమి, నేల, నీరు, కాలుష్యం, నుంచి రక్షించుకోవచ్చని తెలిపారు. నాణ్యమైన పంట ఉత్పత్తులు పొందవచ్చన్నారు. రైతులు యూరియా కోసం ఆందోళన చెందకుండా నానో యూరియాపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏ సుధారాణి, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి





మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ , సమావేశంలో కౌన్సిలర్‌లు, అధికారులు

మున్సిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ

రేపల్లె: పట్టణాభివృద్ధిలో అధికార, ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. పట్టణంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున పట్టణంలో పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. కాలవలు నిరంతరం పూడికలు తీయించటం, అవసరమైన ప్రదేశాలలో బ్లీచింగ్ చల్లించటం చేస్తున్నామన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలని కోరారు. వారంలో ఒక రోజు డ్రై డేని విధిగా పాటించాలన్నారు. అనంతరం అజెండాలోని 26 అంశాలను సమావేశం ఆమోదించింది. సమావేశంలో కమిషనర్ కాకర్ల సాంబశివరావు, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కౌన్సిలర్‌లు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు డాక్ అదాలత్

తెనాలి: విజయవాడలోని రీజినల్ పోస్ట్‌మాస్టర్ జనరల్ ఉత్తర్వుల ప్రకారం మంగళవారం స్థానిక పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో డాక్ అదాలత్ నిర్వహించనున్నారు. పోస్టల్ సూపరింటెండెంట్ జీవీ బాలసరస్వతి సోమవారం ఒక ప్రకటనలో వివరాలను తెలియజేశారు. పోస్టల్ సేవలను పొందటంలో ప్రజలనుంచి ఏవైనా ఫిర్యాదులు ఉన్నట్లయితే, వారు మంగళవారం ఉదయం 11 గంటలకు నేరుగా పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని కోరారు.



నగరం సంతబజార్‌లో సరస్వతీదేవిగా...



బంగారురెడ్డిపాలెంలో మహాలక్ష్మీదేవిగా అమ్మవారు



కనగాల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సరస్వతిగా...



రేపల్లెలో సరస్వతీదేవిగా భ్రమరాంబ అమ్మవారు



రేపల్లెలో సరస్వతీదేవిగా గుండెపాటమ్మ అమ్మవారు



కొల్లూరు మండలం గాజుల్లంకలో...



కొల్లూరు మండలం కోటిపల్లిలో...

చదువుల తల్లికి.. ప్రణమిల్లి

దసరా శరన్నవరాత్రులలో భాగంగా సోమవారం మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని వివిధ దేవాలయాల్లో అమ్మవార్లు సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో చదువుల తల్లి సరస్వతిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

- రేపల్లె/ కొల్లూరు/ వేమూరు/ చుండూరు(వేమూరు)/ చెరుకుపల్లి / కర్లపాలెం /నగరం



చావలి వాలేశ్వరస్వామి దేవస్థానంలో...



రామచౌడేశ్వరస్వామి దేవస్థానంలో...



చినపరిమి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో...

నూతన జీఎస్టీ విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న జిల్లా జీఎస్టీ ప్రత్యేకాధికారి కనిక రెడ్డి



జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో మారుతీశేషాంబ



జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న జిల్లా జీఎస్టీ కార్యాలయ అధికారి రవిచంద్ర

జిల్లా జీఎస్టీ ప్రత్యేకాధికారి కనిక రెడ్డి

చెరుకుపల్లి: జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుంని బాపట్ల డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ జిల్లా జీఎస్టీ ప్రత్యేకాధికారి ఎం.కనిక రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అధ్యక్షుడు షేక్ మహబూబ్ సుభాని అధ్యక్షతన జీఎస్టీ అమలు, సంస్కరణలపై మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కనిక రెడ్డి మాట్లాడుతూ ప్రజలు కొనుగోలు చేసే ప్రతి వస్తువుపై గతంలో కంటే జీఎస్టీ పన్ను భారం తగ్గిందని దీని ద్వారా సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు కొంత మేర ఆర్థిక వెసులుబాటు కలిగిందన్నారు. గతంలో రోజు వారి వస్తువులపై 18 శాతం ఉన్న జీఎస్టీ 5 శాతం అయిందని, ముఖ్యంగా ప్రాణ రక్షణ మందులు, ల్యాబ్ పరికరాలపై జీఎస్టీ పూర్తిగా ఎత్తివేయటం జరిగిందని వివరించారు. నూతన జీఎస్టీ విధానాల వల్ల కలిగే ప్రయోజనాలను గ్రామాల్లోని ప్రజలకు అర్థమైయేలా వివరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో పులి లాజర్, ఏపీఎం త్యాగరాజు, మండలంలోని గ్రామ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన సదస్సు

వేమూరు: రోజువారి వస్తువులకు జీఎస్టీ తగ్గించడం జరిగిందని ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జీఎస్టీ తగ్గింపుపై అధికారులకు అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం పేద, మధ్య తరగతి వర్గాలకు సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని తెలిపారు. గ్రామ సచివాలయ సిబ్బంది జీఎస్టీ తగ్గింపుపై ఇంటింటి ప్రచారం చేయాలని ఆయన సూచించారు. అక్టోబర్ 19వ తేదీ వరకు విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, షేక్ సాధిక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

జీఎస్టీపై ఇంటింటి ప్రచారం చేయాలి

అమర్తలూరు(వేమూరు): జీఎస్టీ తగ్గింపు మహిళల సాధికారతకు బాటలు వేయడం జరిగిందని ఎంపీడీవో మారుతీశేషాంబ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జీఎస్టీపై గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ రాపర్ల నరేంద్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం పేద వర్గానికి చెందిన ప్రజలు వాడే వస్తువులకు జీఎస్టీ తగ్గింపుపై వివరించారు. గ్రామ సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి తగ్గింపు జీఎస్టీపై ప్రచారం చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

చుండూరు(వేమూరు): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం వల్ల కొనుగోలు శక్తి పెంపొందుతుందని బాపట్ల జిల్లా జీఎస్టీ కార్యాలయ అధికారి రవిచంద్ర తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందికి సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఉన్న అత్యధిక జీఎస్టీ రేట్లు, పన్నుల భారాన్ని తగ్గించినందున ప్రజలు, వ్యాపారస్తులు, సంస్థలకు ఉపయోగపడుతుందన్నారు. ఈ నెల 25 నుంచి అక్టోబర్ 13 వరకు రాష్ట్ర వ్యాప్తంగా సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ కార్యక్రమంలో భాగంగా ప్రచారం చేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి సుధారాణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో గ్రామాలు



పెనుమూడిలోని పునరావాస కేంద్రంలో పల్లెపాలెం గ్రామస్తులు



కొల్లూరు మండలం గాజుల్లంక హైలెవల్ చప్టా పై నుంచి వరద నీటి ప్రవాహం



కొల్లూరు మండలం సుగ్గునలంక చప్టాపై ట్రాక్టర్ సాయంతో వరద నీటి ప్రవాహాన్ని దాటే యత్నం

కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. వరద ప్రవాహం నది గట్లపై నుంచి పొర్లి ప్రవహిస్తుండటంతో వేలాది ఎకరాలలో పంట పొలాలు ముంపుకు గురయ్యాయి. నది పరీవాహక గ్రామాలలోని రహదారులపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వరద తీవ్రత అధికంగా ఉండటంతో ప్రభుత్వ యంత్రాంగం నది ప్రజలను అప్రమత్తం చేసే పనిలో నిమగ్నమయ్యింది.

- కొల్లూరు / రేపల్లె